ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..

Q6 NEWS తెలుగు

మేడ్చల్ | సోమవారం | 07.09.2026 | సంపుటి : 2 | సంచిక : 66 | పేజీలు : 8 | వెల : 5/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు పటేల్




## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 107 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 134 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 208 (కిలో) |
| స్కిన్ లెస్ | 235 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹76

## నదీ జలాలపై బీఆర్ఎస్‌ది బోగస్ ప్రచారం

### నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సూర్యాపేట, సెప్టెంబర్ 6 : కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు అన్యాయం జరగకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని, తాము అధికారంలోకి వచ్చిన రెండేళ్ల ఎనిమిది నెలల కాలంలో తెలంగాణ నీటి వాటా కోసం అన్ని వేదికలపై సమర్థంగా పోరాటం చేస్తున్నామని, ఈ విషంలో బీఆర్ఎస్, ఇతర ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని నీటి పారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి

-మిగతా 2 లో..



## అసెంబ్లీకి రాకపోతే రాజీనామా చేయండి

**కేసీఆర్ ఎమ్మెల్యే పదవి నుంచి తప్పుకొని ఉపఎన్నికలకు అవకాశమివ్వాలి**

**మహాధర్నాలో కాంగ్రెస్ నేతల డిమాండ్**

హైదరాబాద్, సెప్టెంబర్ 6 : ప్రభుత్వ జీతం తీసుకుంటూ ఫామ్‌హౌస్‌కు పరిమితమైన బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్‌రావు వెంటనే తన ప్రధాన ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేశ్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. అధికారం, ప్రభుత్వాలు, పదవులు శాశ్వతం కాదని, ప్రజాస్వామ్యంలో ప్రధాన ప్రతిపక్ష నేతకు చాలా గౌరవం

-మిగతా 2 లో..

## అసెంబ్లీ నెల రోజులు నిర్వహించాలి

**ముఖ్యమంత్రిగానే కేసీఆర్ సభలో అడుగుపెడతారు**

**బీఆర్ఎస్ శాసన సభాపక్ష ఉపనేత హరీశ్‌రావు**



హైదరాబాద్, సెప్టెంబర్ 6 : 'ముఖ్యమంత్రి హోదాలో అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి అనుచిత భాష వాడుతున్నారు. అలాంటి గౌరవం లేని సభకు కేసీఆర్ వెళ్లాల్సిన అవసరం లేదు. సభ్య సమాజం తలదించుకొనే వ్యాఖ్యలతో జరుగుతున్న చర్చలో తెలంగాణ సాధించిన ఉద్యమ నాయకుడు కేసీఆర్ పాల్గొనకూడదని భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఏకగ్రీవంగా

-మిగతా 2 లో..



## ఢిల్లీలో కుప్పకూలిన హాస్టల్

**ఐదుగురు విద్యార్థుల మృతి**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6 : దేశ రాజధానిలో సుమారు యాభై ఏళ్ల క్రితం నిర్మించిన ఐదంతస్తుల భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో ఐదుగురు విద్యార్థులు మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన నలుగురికి ఎయిమ్స్‌లో చికిత్స అందిస్తున్నారు. వీరి పరిస్థితి విషమంగా ఉంది. శిథిలాల కింద పలువురు ఉన్నారని భావిస్తున్నారు. వారిలో చాలామంది ఫోన్లుచేసి తమను కాపాడాలని వేడుకున్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. దిల్లీ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణానికి సమీపంలో సత్యనికేతన్‌వద్ద కిక్కిరిసిన ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. దీనిని విద్యార్థుల వసతి గృహంగా వాడుతున్నారు. శిథిలాల కింద చిక్కుకున్నవారిని కాపాడేందుకు ఆక్సిజన్ సిలిండర్లను లోపలకు జారవిడిచారు. రాత్రి వరకు 8 మందిని బయటకు తీసుకురాగలిగారు. ఆసుపత్రికి తీసుకువెళ్లేలోపే నలుగురు చనిపోగా.. మరొకరు చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచారు. మరో ముగ్గురికి చికిత్స కొనసాగుతోంది.

## కాంగ్రెస్ వెయ్యిరోజుల పాలన

# అట్టర్ ఫ్లాప్

### పాలించడం చేతకాకే నాపై అనుచిత వ్యాఖ్యలు

**సాగునీటి కోసం మరో యుద్ధం.. నేనే నేతృత్వం వహిస్తా**

**కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులపై ప్రజల వద్దకెళ్దాం**

**భూమాఫియాతో ప్రజలకు ఇబ్బందులు**

**ప్రభుత్వ పాలనా వైఫల్యాలపై అసెంబ్లీ, మండలిలో గట్టిగా నిలదీయాలి**

**భారాస ఎల్పీ సమావేశంలో పార్టీ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం**



**అసెంబ్లీ సమావేశాలకు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తప్పకుండా హాజరుకావాలని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. శాసనసభ, మండలిలో జరిగే ప్రతి చర్చలో పాల్గొనాలన్నారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ పలు సూచనలు చేశారు. ఈ సమావేశాలను ఎవరూ లైట్ తీసుకోవద్దన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.**

హైదరాబాద్, సెప్టెంబర్ 6 : "శాసనసభ, మండలిలో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలి. ప్రజల అజెండానే బీఆర్ఎస్ అజెండాగా ఉండాలి. కాంగ్రెస్, భాజపా విధానాలను ఎండగట్టాలి. స్పీకర్ పక్షపాత ధోరణి, అప్రజాస్వామిక విధానాలపై నిలదీయాలి. కాంగ్రెస్ వెయ్యిరోజుల పాలన అట్టర్‌ఫ్లాప్. తమ ప్రభుత్వం మళ్లీరాదని కాంగ్రెస్ నేతలకు అర్థమైంది. అందుకే అడ్డగోలుగా దోపిడీ చేస్తున్నారు. నా చావు కోరుతూ పదే పదే మాట్లాడుతున్నారు. పాలన చేతకాకే రేవంత్‌రెడ్డి బూతు పురాణం. అలాంటి వ్యక్తితో చర్చకు అసెంబ్లీకి రావాలా?సమావేశాల్లో అధికార పార్టీ నేతలు నా గురించి మాట్లాడే

-మిగతా 2 లో..



## భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

### 22ఏ సమస్య ఎందుకొచ్చింది?

**ఆరా తీసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

**రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖలపై అధికారులతో సమావేశం**

**భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పలు భూ సంబంధిత సమస్యలపై ముఖ్యమంత్రి ఆరా తీసినట్లు సమాచారం. ఈ సందర్భంగా నిషేధిత జాబితా అంశంపైనా ఆయన అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. "గతంలో ఎప్పుడూ ఈ సమస్య లేదు కదా.. 22ఏ వివాదంగా మారడానికి అసలు కారణాలు ఏంటి' అని సీఎం ప్రశ్నించినట్లు సమాచారం. దీనిపై రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్ వివరాలు తెలియజేసినట్లు తెలిసింది.**

హైదరాబాద్, సెప్టెంబర్ 6 : 22ఏ సమస్యలు ఎప్పటి నుంచో ఉన్నాయని పేర్కొంటూ.. నిషేధిత భూముల జాబితాను అప్‌డేట్ చేయాలంటూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకే గతేడాది చివర్లో జిల్లా కలెక్టర్లు సంతకాలు చేసిన ప్రతులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారని పేర్కొన్నారు. ఎక్కడెక్కడ సమస్యలు

-మిగతా 2 లో..

## ఉద్యోగుల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యం

**ఈహెచ్‌ఎస్ అమలులో రాజీ లేదు**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



హైదరాబాద్, సెప్టెంబర్ 6 : ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యభద్రత విషయంలో ప్రజా ప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధితో పనిచేస్తోందని డిప్యూ టీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఉద్యోగుల ఆరోగ్యానికి సంబంధించిన ఎంప్లాయీస్ హెల్త్‌స్కీమ్ (ఈహెచ్‌ఎస్) అమలులో ఎలాంటి రాజీ ఉండదని వెల్లడించారు. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఆదివారం మహాత్మా జ్యోతిరావు ఫూలే ప్రజాభవన్‌లో ఈహెచ్‌ఎస్ ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మా ట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు,

-మిగతా 2 లో..

# నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

**వెయ్యిరోజుల పాలనలో అభివృద్ధిపై వివరించనున్న ప్రభుత్వం**

**నిషేధిత అస్త్రంతో విపక్షాలు..తిప్పికొట్టేందుకు సిద్ధమవుతున్న సర్కారు**

**హామీల వైఫల్యాలు ఎజెండాగా ఢీకొట్టనున్న భారాస, భాజపా**

**తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నా యి. తొలిరోజు శాసనసభలో చేపట్టాల్సిన అధి కారిక కార్యక్రమాలతో కూడిన 'లిస్ట్ ఆఫ్ బిజినెస్'ను శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి జారీ చేశారు. తొలిరోజు ఎజెండాలో భాగంగా ప్రశ్నోత్తరాలతో పాటు పలు కీలక నివేదికలను సభకు సమర్పిస్తారు.**

హైదరాబాద్, సెప్టెంబర్ 6 : తెలంగాణ శాసన సభ, శాసనమండలి సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భం గా వాడీవేడి చర్చలు జరగనున్నాయి. వెయ్యి రోజుల ప్రజాపాలనలో సాధించిన విజయాల ను ఘనంగా చాటిచెప్పేలా ప్రభుత్వం సన్నద్ధ మవుతోంది. సంక్షేమం, అభివృద్ధిపై అంశాల వారీగా వివరించనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల దుమారం లేపిన 22ఏ భూముల వ్యవహారంపై ప్రధానంగా అసెంబ్లీలో

-మిగతా 2 లో..





## భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఉత్పన్నమయ్యాయి.. ఏ మేరకు పరిష్కరించామనే వివరాలను కూడా ఆయన సీఎంకు తెలిపారు. హైదరాబాద్ పరిసర జిల్లాల్లోనే సమస్య కనిపించిందని.. వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిష్కరించినట్లు వివరించారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ.. భూ సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలంటూ సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రిని ఆదేశించారు. సమావేశానికి పలువురు కలెక్టర్లు హాజరయ్యారు. నిషేధిత భూముల జాబితా అంశం శాసనసభ సమావేశాల్లో చర్చకు రానున్న నేపథ్యంలో దీనిపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రభుత్వ భూముల సమగ్ర వివరాలను ఈ వేదికగా ప్రజలకు వెల్లడించేందుకు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సిద్ధమయ్యారు. హైకోర్టు ఆదేశాలతో 2025 చివర్లో జాబితాలను రిజిస్ట్రేషన్ల శాఖ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసింది. ఈ క్రమంలో కొన్ని ప్రైవేటు ఆస్తులు కూడా ఆ జాబితాలో ఉన్నాయంటూ ప్రతిపక్షాలు ప్రశ్నిస్తూ వస్తున్నాయి. పాత జాబితాలో ఏ వివరాలు ఉన్నాయి, కొత్తగా అప్‌లోడ్ చేసిన జాబితాలో ఉన్న వివరాలు ఏంటనేది సభలో మంత్రి వివరించనున్నట్లు తెలిసింది. ఆదివారం ఈ అంశాలపై మంత్రి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులతో సుదీర్ఘ సమీక్ష చేశారు. 22ఏ జాబితాను స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత.. ఆ జాబితాలో ఉన్నాయంటూ పలుచోట్ల భూములను రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్ రిజిస్ట్రార్లు తిరస్కరించారు. ప్రధానంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో ఇలాంటివి వెలుగు చూశాయి. బాధితుల నుంచి దరఖాస్తులు స్వీకరించగా.. 980 వచ్చాయి. వీటి పరిష్కారానికి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖల కార్యదర్శులతో ప్రభుత్వం హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో శాసనసభలో విపక్షాల నుంచి వచ్చే ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చేందుకు రెవెన్యూ శాఖ సన్నద్ధమైంది. సభ్యులు 22ఏ సంబంధిత ప్రశ్నలు వేస్తే వాటికి సరైన జవాబు అందించే విధంగా జిల్లాల వారీగా పూర్తి సమాచారాన్ని తెప్పించింది. రాష్ట్రంలో ఏళ్లుగా సాగుచేసుకుంటున్న భూములకు హక్కులు లేని రైతులకు ఇటీవల పట్టాలు పంపిణీ చేశారు. సమీక్షలో ఈ అంశంపైనా చర్చించినట్లు తెలిసింది. ఇటీవల సూర్యాపేట జిల్లా నూతన్‌కల్‌లో 1,061 మంది రైతులకు 1,044 ఎకరాలు, మహబూబాబాద్ జిల్లా నారాయణపురంలో 780 మంది రైతులకు 1,378 ఎకరాలకు పట్టాలు అందజేయగా.. భద్రాద్రి, ములుగు జిల్లాల్లోనూ పంపిణీ చేపట్టాల్సి ఉండటంపై సమీక్షించినట్లు తెలిసింది. ఇదే తరహాలో ఇతర జిల్లాల్లో కూడా ఏళ్ల తరబడి హక్కులు రాని భూముల వివరాలను సిద్ధం చేసి సర్వే చేపట్టాలని కూడా రెవెన్యూ శాఖను మంత్రి ఆదేశించినట్లు సమాచారం.



## ఉద్యోగుల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

వారి కుటుంబ సభ్యులు, డిపెండెంట్లకు అనారోగ్య సమయంలో ఆర్థిక, మానసిక ఇబ్బందులు తలెత్తకుండా ఆరోగ్య భద్రత కల్పించాలన్న ఉద్దేశంతోనే హెల్త్ స్కీమ్ అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. దశాబ్దాలుగా ఉద్యోగులు ఎదురుచూస్తున్న సమస్యను మానవీయ కోణంలో పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. ప్రభుత్వంలో పనిచేస్తున్న ఉద్యోగులు, కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా ఉండటమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈహెచ్‌ఎస్ పథక రూపకల్పన, విధివిధానాలపై ఉద్యోగ సంఘాలతో పలుమార్లు సమావేశాలు నిర్వహించి వారి సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నాకే విధివిధానాలు ఖరారు చేశామని భట్టి తెలిపారు. ప్రభుత్వం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూనే ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం ఇచ్చి పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఇప్పటికే ఈహెచ్‌ఎస్‌లో 354 ప్రైవేట్ ఆస్పత్రులు ఉన్నాయని, మరికొన్ని ఆస్పత్రులను డీమ్డ్ ఎంప్యానెల్డ్ విధానంలో చేర్చినట్టు వెల్లడించారు. ఆయా ఆస్పత్రుల యాజమాన్యాలతో అధికారులు సమావేశాలు నిర్వహించి పథకం సజావుగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉద్యోగులకు హెల్త్ కార్డుల జారీ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను గత పదేళ్లుగా ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని భట్టి విక్రమార్క విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని హెల్త్‌కార్డు పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చిందని గుర్తుచేశారు. ఉద్యోగుల ఆరోగ్యం, వారి కుటుంబాల సంక్షేమం విషయంలో ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా, కమిట్‌మెంట్‌తో పనిచేస్తోందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, జీఏడీ స్పెషల్ సీఎస్ మహేశ్‌దత్ ఎక్కా, ఆరోగ్య, వైద్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ, ఈహెచ్‌ఎస్ సీఈఓ హనుమంతు, ఉద్యోగ సంఘాల నాయకులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వెయ్యిరోజుల పాలన అట్టర్ ఫ్లాప్

(మొదటిపేజీ తరువాయి)

'కాంగ్రెస్‌ది థర్డ్‌క్లాస్ పాలన. తెలంగాణ రైజింగ్ కాదు.. డౌన్‌ఫాల్ వైపు వెళ్లింది. కాంగ్రెస్‌కు నూకలు చెల్లాయని అర్థమైంది. అందుకే ఆ పార్టీ నేతలు దోపిడీకి పాల్పడుతున్నారు. తెలంగాణ రైజింగ్ కాదు.. డౌన్‌ఫాల్ వైపు వెళ్లింది. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన అసెంబ్లీని అధికార పక్షం బూతు కూతలకు వేదికగా మార్చింది. పాలన చేతకాక చిల్లర మాటలతో కాలం వెళ్లదీస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రతిపక్షంగా ప్రజల గొంతును ఉభయ సభల్లో బలంగా వినిపించే బాధ్యత బీఆర్‌ఎస్‌పైనే ఉంది. ప్రజల జెండానే బీఆర్‌ఎస్ ఎజెండాగా ఉండాలి., ప్రతి చర్చలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తప్పనిసరిగా పాల్గొనాలి. శాసనమండలి కూడా పాత భవనంలోకి వచ్చిన నేపథ్యంలో రెండు సభల్లో పార్టీ సభ్యులు మరింత సమన్వయంతో వ్యవహరించాలి..' అని కేసీఆర్ సూచించినట్లు తెలిసింది. కాళేశ్వరం ప్రాజెక్టులను వినియోగించుకోవచ్చని కోవచ్చని ఎన్డీఎస్‌ఏ స్పష్టం చేసినా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. మేడిగడ్డ వద్ద అవసరమైన చిన్నపాటి మరమ్మతులు చేపట్టి ప్రాజెక్టులను వినియోగంలోకి తెస్తే దాదాపు 13 జిల్లాల రైతాంగానికి ప్రయోజనం కలుగుతుంది. అయినా నీటిని ఎత్తిపోసేందుకు ప్రభుత్వం ఎందుకు ప్రయత్నించడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలి. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లో నీళ్లున్నా తెలంగాణ పంటలకు విడుదల చేయడం లేదు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం దాదాపు 90 శాతం పూర్తి చేసిన పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ఎందుకు ముందుకు తీసుకెళ్లడం లేదు? కాళేశ్వరం, పాలమూరు--రంగారెడ్డి అంశాలపై అవసరమైతే ఉభయ సభలను స్తంభింపజేయాలి. వీటి విషయంలో ఇదే నిర్లక్ష్యం కొనసాగితే సాగునీటి కోసం లక్షలాది మంది రైతులు, కార్యకర్తలతో కలిసి నేనే



స్వయంగా ప్రత్యక్ష కార్యాచరణ చేపడతా. సాగునీటి కోసం త్వరలో మరో యుద్ధానికి సిద్ధమవుదాం..' అని కేసీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 'పేద విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమైన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. దీనిపై విద్యార్థుల తరపున అసెంబ్లీ వేదికగా గళం విప్పాలి. పాలిటెక్నిక్ విద్యను దెబ్బతీసేలా జీవో 97 తీసుకొచ్చిన ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించాలి. ఎన్నికలకు ముందు లక్షలాది ఉద్యోగాల హామీ ఇచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు జాబ్ క్యాలెండర్, ఉద్యోగ నోటిఫికేషన్ల విషయంలో ఎందుకు విఫలమైందో నిలదీయాలి. ప్రభుత్వ పాఠశాలలను తగ్గించే ప్రయత్నాలు, గురుకులాల నిర్వహణలో వైఫల్యాలు, విద్యార్థులు, బాలికల మరణాలపై ప్రభుత్వం సమాధానం చెప్పేలా చేయాలి. పేదలు, మధ్యతరగతి ప్రజల పట్టా భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చి అత్యవసర పరిస్థితుల్లోనూ విక్రయించుకోలేని పరిస్థితి కల్పించడంపైనా పోరాడాలి. మిషన్ భగీరథ వ్యవస్థను నిర్వీర్యం చేసి తాగునీటి సమస్యను తీవ్రతరం చేశారు. విద్యుత్ రంగంలో ప్రభుత్వం తీసుకొస్తున్న నిర్ణయాలు ఉచిత విద్యుత్‌కు ముప్పుగా మారే ప్రమాదం ఉంది. వ్యవసాయానికి ప్రత్యేక డిస్కం ఏర్పాటు వెనుక కుట్ర ఉంది. రిటైర్డ్ ఉద్యోగులకు పీఎఫ్ వంటి బకాయిలు చెల్లించకపోవడం, పీఆర్సీ పెండింగ్, ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలి. ఫార్మాసిటీని రద్దు చేసి ఫ్యూచర్ సిటీ పేరుతో భూముల వ్యవహారాన్ని తెరపైకి తీసుకురావడం, సింగరేణిలో అవినీతి, ప్రభుత్వ భూముల విక్రయాలు, మెట్రో నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకోవడం, గోదావరి--కావేరి నదుల అనుసంధానం వంటి అంశాలపై ఉభయ సభల్లో ప్రశ్నించాలి. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించడం, మహిళలపై దాడులు పెరగడం, అవినీతి, బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం వంటి అంశాలపైనా కాంగ్రెస్‌ను ఎండగట్టాలి..' అని కేసీఆర్ స్పష్టం చేశారు. వంద రోజుల్లో అమలు చేస్తామన్న గ్యారంటీలు, హామీలను వెయ్యి రోజులైనా అమలు చేయలేకపోయిన ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై బీఆర్‌ఎస్ చేపట్టిన నిరసన కార్యక్రమాలు విజయవంతం కావడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కేటీఆర్, పార్టీ ముఖ్య నేతలు, జిల్లా నాయకత్వం, కార్యకర్తలను అభినందించారు. తాను అసెంబ్లీకి హాజరయ్యే అంశంపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అభిప్రాయాలను కేసీఆర్ కోరగా.. ప్రస్తుత సభ గౌరవ సభగా కాకుండా 'కౌరవ సభ'గా మారిందని సభ్యులు అభిప్రాయపడినట్లు తెలిసింది.

## నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

(మొదటిపేజీ తరువాయి)

చర్చించడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా సిద్ధమవుతోంది. ఇదే విషయంపై చర్చకు ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తుండడంతో.. విపక్షాల విమర్శలు, ఆరోపణలకు దీటుగా సమాధానమిచ్చేలా సర్కారు ఏర్పాట్లు చేసుకున్నట్లు సమాచారం. మరోవైపు ప్రధాన ప్రతిపక్షం భారాస సహా భాజపా కూడా ఇదే అంశంపై చర్చించాలని డిమాండ్ చేస్తుండడంతో.. భూముల వ్యవహారంపైనే అవసరమైతే రెండు రోజులు చర్చించే అవకాశాలను ప్రభుత్వం పరిశీలించనున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనా వైఫల్యాలను ప్రధాన ఎజెండాగా భారాస, భాజపా చర్చకు సిద్ధమవుతున్నాయి. తొలిరోజు సమావేశాల ప్రారంభానికి ముందు కొత్తగా నిర్మించిన 'సెంట్రల్ హాల్'ను సీఎం రేవంత్‌రెడ్డి ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తారు. దీనికి మాజీ స్పీకర్, దివంగత నేత దుద్దిళ్ల శ్రీపాదరావు పేరుపెట్టారు. ఈ కార్యక్రమం అనంతరం శాసనసభ, మండలి ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయి. తొలిరోజు ఇరుసభల్లోనూ ప్రశ్నోత్తరాలను నిర్వహించనున్నారు. 'తెలంగాణ సమగ్ర శిక్షణ'.. 'పీఎం స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా'.. 'మెట్రో రైలు'కు సంబంధించిన ఆడిట్ రిపోర్టులను సభ ముందుంచుతారు. అనంతరం ఉభయసభలు వాయిదా పడతాయి. తర్వాత శాసనసభ, మండలికి సంబంధించి వేర్వేరుగా 'బిజినెస్ అడ్వైజరీ కమిటీ(బీఏసీ)' సమావేశాలు జరుగుతాయి. ఈ సమావేశాల్లో శాసనసభ, శాసనమండలిని ఎన్నిరోజుల పాటు నిర్వహించాలి? ఏయే అంశాలను చర్చించాలి? అనేది నిర్ణయిస్తారు. ఈ సమావేశాలు సుమారు 4 నుంచి 6 రోజుల పాటు జరిగే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ చర్చించాల్సిన అంశాల ప్రాధాన్యాన్ని బట్టి సభ నిర్వహణ రోజులను పొడిగించే అవకాశాలుంటాయి. అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్షాల విమర్శలను వాస్తవిక సమాచారం, దీటైన సమాధానాలతో ఎదుర్కోవాలని అధికార కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని, వాటిని అసెంబ్లీ వేదికగా తిప్పికొట్టాలని రంగం సిద్ధం చేస్తోంది. సోమవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా విడిగా కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశం కూడా జరిగే అవకాశాలున్నాయని పార్టీవర్గాలు వెల్లడించాయి. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేస్తారని నేతలు తెలిపారు. ప్రధానంగా 22ఏ భూముల అంశంపై అసత్య ప్రచారం ఎక్కువగా చేస్తున్నారని, భారాస పాలనలోనే ఇది ఉందనే విషయాన్ని ఆధారాలతో సహా సభలో చెప్పాలని ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులైన సందర్భంగా ఇప్పటివరకూ చేపట్టిన సంక్షేమ పథకాలు, వాటివల్ల ప్రజలకు ఒనగూరిన ప్రయోజనాలు, నిధుల వినియోగంతో పాటు.. సాధించిన విజయాలు తదితర అంశాలను సమగ్రంగా శాసనసభ ద్వారా ప్రజలకు తెలపాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, సన్నబియ్యం పంపిణీ తదితర పథకాలను పార్టీలతో సంబంధం లేకుండా నేరుగా పేదలందరికీ ఇస్తున్న వైనాన్ని ప్రముఖంగా చెప్పాలని కాంగ్రెస్ వ్యూహాలు సిద్ధం చేస్తోంది.




## నదీ జలాలపై బీఆర్‌ఎస్‌ది బోగస్ ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కోదాడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నదీజలాల విషయంలో ఎలాంటి రాజీపడకుండా ట్రిబ్యునల్స్, కేఆర్ఎంబీ, కేంద్రప్రభుత్వం వద్ద తెలంగాణ ప్రభుత్వం తమ వాదనలు వినిపిస్తోందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో నీటిపారుదల శాఖను భ్రష్టు పట్టించిందని, కోటి 81 లక్షల రూపాయలు ఖర్చు చేసి అదనంగా ఒక్క ఎకరానికి కూడా నీరు ఇవ్వలేదని విమర్శించారు. రూ.80 వేల కోట్లు ఖర్చుపెట్టి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు రూ.27 వేల కోట్లు, సీతారామ ప్రాజెక్ట్‌కు రూ.8 వేల కోట్లు ఖర్చుపెట్టారని ఈ రెండు ప్రాజెక్టులతో ఒక్క ఎకరం ఆయకట్టుకు కూడా నీరు ఇవ్వలేదని ఉత్తమ్ తెలిపారు. గౌరవెల్లి, నెట్టెంపాడు, కల్వకుర్తి, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను పూర్తి చేయలేదని, తామ చిత్తశుద్ధితో ఈ ప్రాజెక్టులను సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో పూర్తిచేసి రైతులకు సాగు నీరందిస్తామన్నారు.

## అసెంబ్లీ నెల రోజులు నిర్వహించాలి

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయించారు' అని భారాస శాసన సభాపక్ష ఉపనేత టి.హరీశ్ రావు వెల్లడించారు. ఎన్టీఆర్, జయలలిత, చంద్రబాబు లాంటి నేతలను సభలో అవమానిస్తే... వారు సమావేశాలను బహిష్కరించి, ప్రజాక్షేత్రంలో గెలిచి మళ్లీ ముఖ్యమంత్రులుగా అడుగుపెట్టారని, కేసీఆర్ కూడా అదేబాటలో మళ్లీ సీఎంగానే శాసనసభలో అడుగుపెడతారని స్పష్టంచేశారు. సోమవారం నుంచి ప్రారంభంకానున్న అసెంబ్లీ, శాసనమండలి సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై భారాస అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఎర్రవెల్లిలో ఆదివారం భారాస ఎల్పీ సమావేశం నిర్వహించారు. అనంతరం చర్చించిన వివరాలను పార్టీ ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, కేపీ వివేకానంద, విజయుడు, కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులతో కలిసి హరీశ్‌రావు మీడియాకు వెల్లడించారు. "కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు, దళిత, గిరిజన, బీసీ వర్గాలను నిలువునా మోసం చేశారు. ప్రజా సమస్యలపై సమగ్రంగా చర్చించడానికి కనీసం నెల రోజులపాటు అసెంబ్లీ సమావేశాలు నడపాలని బీఏసీ సమావేశంలో భారాస పక్షాన గట్టిగా డిమాండ్ చేయాలని నిర్ణయించాం. 22ఏ కింద భూములను నిషేధిత జాబితాలో పెట్టి రైతులను ఇబ్బందిపెడుతున్న తీరుపై, కరెంట్ కోతలు, రుణమాఫీ వైఫల్యం, పాలిటెక్నిక్ జీవో 97 రద్దు, సింగరేణి కుంభకోణాలు, పీఆర్సీ, డీఏలు, ఈహెచ్‌ఎస్ ఫెయిల్యూర్ వంటి అన్ని అంశాలపైనా అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం. రాష్ట్రంలో 30 లక్షల మంది విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో వారి భవిష్యత్తు అంధకారమవుతోంది. విద్యార్థుల పక్షాన అవసరమైతే సభను స్తంభింపజేసైనా న్యాయం జరిగే దాకా కొట్లాడతాం. కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా రాబోయే రోజుల్లో కేసీఆర్ స్వయంగా లక్షల మందితో ప్రత్యక్ష ఉద్యమానికి నాయకత్వం వహిస్తారు. పాలన చేతకాక ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటూ.. ఆ అసహనంలో సీఎం రేవంత్‌రెడ్డి 'కేసీఆర్ రాజీనామా' అంటూ కొత్త డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరతీశారు. దేవుళ్ల మీద ఒట్టేసి మాట తప్పిన ముఖ్యమంత్రే రాజీనామా చేయాలి. పక్క రాష్ట్రాల్లో మాజీ సీఎంలకు భద్రత కల్పించడం లేదా? కనీసం వార్డు మెంబర్ కూడా కాని సీఎం సోదరుడికి నలుగురు గన్‌మెన్లు పెట్టి, భద్రత కోసం రూ.40 కోట్లు ఎలా ఖర్చు చేశారో సీఎం సమాధానం చెప్పాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఆదివారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి తమ ఇబ్బందులను అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

## అసెంబ్లీకి రాకపోతే రాజీనామా చేయండి

(మొదటిపేజీ తరువాయి)

ఉంటుందని, అలాంటి పదవిని అపహాస్యం చేయవద్దని హితవు పలికారు. అసెంబ్లీకి రాని కేసీఆర్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం టీపీసీసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ సలహాదారు, మాజీ ఎంపీ వి. హనుమంతరావు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజహరుద్దీన్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వివేక్‌లతో పాటు ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అనిల్ కుమార్‌యాదవ్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు జగ్గారెడ్డి అంజన్‌కుమార్ యాదవ్, పలువురు డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రజాపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమం కేసీఆర్‌కు కనపడడం లేదా అని ప్రశ్నించారు. 'మేం తప్పు చేస్తే ప్రతిపక్షాలు ఎత్తి చూపొచ్చు. కానీ అసత్యాలు ప్రచారం చేయడం సబబు కాదు. తప్పిదాలు జరిగితే సరిదిద్దుకుంటాం..' అని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి, సంక్షేమం అమలు జరుగుతున్నాయని, మళ్లీ కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అధికారం ప్రజలు ఇచ్చే కానుక అని, దాన్ని మేం సద్వినియోగం చేసుకుంటుంటే, ప్రజలిచ్చిన అవకాశాన్ని ప్రతిపక్ష పార్టీలు దుర్వినియోగం చేసుకుంటున్నాయన్నారు. మంత్రి అజహరుద్దీన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ.. కేసీఆర్ తెలంగాణ ప్రజల సొమ్ము తింటూ ఫామ్‌హౌస్‌లో పడుకుంటున్నాడని విమర్శించారు. అసెంబ్లీకి వస్తావా, రాజీనామా చేస్తావా అని ప్రశ్నించారు. ఒకవేళ కేసీఆర్ రాజీనామా చేయకపోతే స్పీకర్ తగిన చర్యలు తీసుకుని ఆయన శాసనసభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# సండే స్కూల్ పిల్లలు శభాష్



## దుబ్బాక గడ్డపైహరీశ్‌రావు రెచ్చగొట్టే రాజకీయాలు తక్షణమే మానుకోవాలి

**దుబ్బాక, సెప్టెంబరు 6 (జనం వార్త) :** దుబ్బాక మండలం హబ్సిపూర్ ఎక్స్‌రోడ్ వద్ద మాజీ మంత్రి హరీశ్‌రావు రైతుల మహాధర్నా పేరుతో దుబ్బాకలో రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్. దుబ్బాక పట్టణ అధ్యక్షుడు మల్లు గారి చంద్రారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు అనంతల శ్రీనివాస్ సత్తు శ్రీనివాస్ రెడ్డి .పిట్ల స్వామి తో నిరసన నిరసన వ్యక్తం చేశారు. ఆదివారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని శివాజీ చౌరస్తా వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. గతంలో హరీశ్‌రావు మంత్రిగా ఉన్న సమయంలో దుబ్బాక నియోజకవర్గానికి రావాల్సిన నిధులను సిద్దిపేట, గజ్వేల్ ప్రాంతాలకు తరలించారని ఆరోపించారు. దుబ్బాక అభివృద్ధిని విస్మరించిన వారు ఇప్పుడు రైతుల సమస్యల పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్నారు. రైతుల సమస్యలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే వాటి పరిష్కారానికి సహకరించాలని, దుబ్బాకలో ఉద్రిక్తతలు సృష్టించే ప్రయత్నాలను మానుకోవాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గడిల జనార్దన్ రెడ్డి. ఐరన్ సాయి తేజ గౌడ్.మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆకుల భరత్,మట్ట కిషన్ రెడ్డి. మున్సిపల్ యువజన నాయకులు కొండే స్వామి రెడ్డి. కంచర్ల శివ.దత్తం స్వామి. పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన బీర్ల అయిలయ్య

**యాదగిరిగుట్ట:** మండలంలోని వంగపల్లి గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలకు వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలు, మందులు అందించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రజలకు వైద్యం అందించడంలో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వంగపల్లి గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరానికి స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## మేడ్చల్ హౌసింగ్ బోర్డ్ కాలనీలో బైక్ చోరీ

**మేడ్చల్ ప్రతినిధి సెప్టెంబర్ 06 :** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో బైకు చోరీకి గురైందని చంద్రశేఖర్ తెలిపారు.గత శుక్రవారం రాత్రి ఇంటి ముందు పార్కింగ్ చేసిన తమ పాషన్ ప్లస్ బైకు (టీఎస్28దీదీ3663) అపహరణకు గురైందని బాధితుడు చంద్రశేఖర్ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.అదే రోజు రాత్రి దొంగలు కాలనీలో వీధులలో తిరుగుతూ పలు కేబుల్ వైర్లను కూడా చోరీ చేసినట్లు సీసీ కెమెరాల ద్వారా గుర్తించినట్లు పోలీసులు గుర్తించారు. దొంగతనానికి పాల్పడిన వారికోసం మేడ్చల్ పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రతిరోజు అర్ధరాత్రి సమయంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



## పండుగ సాయన్న విగ్రహ ఏర్పాటుకు చెక్కు అందజేత

**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 06 (జనం వార్త):** నాగర్ కర్నూల్ పట్టణ కేంద్రంలో ప్రతిష్ఠించనున్న పండుగ సాయన్న విగ్రహ ఏర్పాటుకు ముదిరాజ్ ముద్దుబిడ్డ, కలియుగ కర్ణుడు నీలం మదన్న ఆర్థిక సహాయం అందించారు. విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని కోరిన వెంటనే స్పందించిన ఆయన, ఏమాత్రం ఆలస్యం చేయకుండా అక్కడికక్కడే చెక్కును అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు సుంకరబోయిన మహేష్, తెర్పోల్ సర్పంచ్ సతీష్, వాకిటి ఆంజనేయులు, నాగర్ కర్నూల్ పెబ్బేటి ధనుంజయ్, చెంది నర్సయ్య, శేఖర్, మంజుల రాముడు, లక్ష్మయ్య, తిమ్మాజిపేట్ మండల అధ్యక్షులు, యానమోని తిరుపతయ్య, గూల్ల చెన్నకేశవులు, తవిటి నిరంజన్, తవిటి నర్సింహా, తెప్ప రుద్రయ్య, తవిటి శంకర్, గువ్వల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

### క్రీస్తు తిరిగి వస్తున్నాడు

### ఘనంగా ఎల్-షద్దాయి సండే స్కూల్ పిల్లల ర్యాలీ

**నాగారం, సెప్టెంబర్ 6 (జనంవార్త) :** బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము వాడు పెద్దవాడైనప్పుడు దాని నుండి తొలగిపోడని దైవ సేవకురాలు డాక్టర్ ఎలీషెబా ఆంధ్రూ అన్నారు.నాగారం డివిజన్ పరిధిలోని ఎల్- షద్దాయి చర్చ్ సండే స్కూల్ టీచర్స్ ఆధ్వర్యంలో క్రీస్తు తిరిగి వస్తున్నాడు అంశంపై సండే స్కూల్ పిల్లలు (స్క్రిప్ట్) ర్యాలీ ఘనంగా ఆదివారం నిర్వహించారు.ఈ సందర్భంగా సండే స్కూల్లో పిల్లలు నేర్చుకున్న కంఠత వాక్యాలు చెప్పడంతో మందిరం మంత ఆనందోత్సవంతో నిండుకున్నది.అనంతరం చిన్నారుల ఆటపాటలు అలరించారు.ఈ సందర్భంగా దైవ సేవకురాలు డాక్టర్ ఎలీషెబా ఆంధ్రు మాట్లాడుతూ ఒకే చోట ఒకే విషయంపై అందరూ కలిసి దేవుని విషయాలు చర్చించడమే ర్యాలీ అంటారని తెలిపారు. క్రీడాకారులు టిమ్ టెబో దేవుని సువార్త పరిచర్య ఎలా చేశారో మన జీవితంలో క్రీస్తును ఎరిగిన ప్రతి ఒక్కరు దేవుని పరిచర్యను శుద్ధతో చేయాలని సూచించారు. అంతేకాకుండా సువార్తికులు చార్లీకిర్క్, అబ్రహం అగ్యులర్ వారు చిన్ననాటి నుండే స్కూల్లో సువార్త ప్రకటిస్తూ అనేకులను దేవుని వైపు తిప్పినారు.అనంతరం చిన్నారులకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా మందిరంలో అందరికీ ప్రేమ విందును ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో సండే స్కూల్ టీచర్స్,యూత్ బ్రదర్స్,బాధ్యతగల సహోదరులు,ఎల్-ష ద్దాయి విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.






## అమ్మవార్ల ఆలయానికి ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నిక

### మాజీ కౌన్సిలర్ పంగ హరిబాబు

**నాగారం, సెప్టెంబర్ 6 (జనంవార్త) :** శ్రీ పోచమ్మ, ముత్యాలమ్మ, బంగారు మైసమ్మ అమ్మవార్ల ఆలయ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నారు.నాగారం డివిజన్ పరిధిలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ భవన్‌లో ఆలయ ధర్మకర్తలు, కుల పెద్దలు, బస్తీ పెద్దలు, కాలనీవాసుల సమక్షంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆలయ అభివృద్ధి,భక్తులకు సౌకర్యాల కల్పన,పూజా కార్యక్రమాలు, జాతరలు, పండుగలు,ప్రత్యేక ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. అనంతరం అందరి సమ్మతితో నూతన కమిటీ అధ్యక్షులు ఎర్రి ఉషయ్య, ఉపాధ్యక్షులు బొల్లారం బాలనర్సింహా, కార్యదర్శి అనుపాటి శ్రవణ్ కుమార్,సంయుక్త కార్యదర్శి పంగ కుమార్,కోశాధికారి నిమ్మల రవి,ఆర్గనైజర్లు ఎర్ర యాదగిరి,ఎర్ర లింగం,ఎల్దూరి రమేష్ లను





ఎన్నుకున్నారు. అనంతరం మాజీ కౌన్సిలర్ పంగ హరిబాబు పాత కమిటీ సభ్యులకు శాల్వాను కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.మాజీ అధ్యక్షుడు ఎల్దూరి మల్లేష్ నూతన కమిటీకి అభినందనలు తెలిపి, ఆలయ కమిటీ వద్ద ఉన్న రూ.50,659 నగదును నూతన కమిటీకి అప్పగించి బాధ్యతలను బదలాయించారు. అమ్మవార్ల ఆశీస్సులతో ఆలయ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ అభివృద్ధికి కాలనీవాసులు,భక్తులు ఐకమత్యంతో సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంగ ముత్యాలు, నిమ్మల కృష్ణ, ఏర్పుల శంకరయ్య, ఎల్దూరి ఆంజనేయులు, పంగ యాదగిరి, పంగ శ్రీహరి,కిష్టన్నగారి లింగం, ఏర్పుల అశోక్,ఎర్ర మహేష్, ఎర్ర వామన్‌రావు,ఎర్ర విద్యాసాగర్,కిష్టన్నగారి రవి,కొండపాక రఘుపతి తదితరులు పాల్గొన్నారు.



## తెప్ప శ్రీనివాసుకు ఆత్మీయ సన్మానం

**బిజినేపల్లి, సెప్టెంబర్ 6 (జనం వార్త):** మార్షల్ ఆర్ట్స్ (తైక్వాండో)లో గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన లయన్ డాక్టర్ తెప్ప శ్రీనివాసును బాల్య మిత్రులు, పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పాలెం బాలాజీ గార్డెన్‌లో నిర్వహించిన 1987--88 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయనను ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. సుబ్బయ్యపాలెం గ్రామానికి చెందిన తెప్ప శ్రీనివాస్ మరో ఆణిముత్యమని, ఆయన విజయాలు గ్రామానికి గర్వకారణమని అన్నారు. చిన్ననాటి నుంచే మార్షల్ ఆర్ట్స్‌పై ఆసక్తితో సాధన కొనసాగిస్తూ, అనేక సంవత్సరాలుగా విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటడంతో పాటు గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించడం తమకు ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా లయన్ డాక్టర్ తెప్ప శ్రీనివాస్ మాట్లాడుతూ.. నిరుపేదల సేవకే తన జీవితాన్ని అంకితం చేశానని తెలిపారు. తన బాల్య మిత్రులు, పూర్వ విద్యార్థులు తన విజయాలను గుర్తించి ఆత్మీయంగా సన్మానించడం జీవితంలో మరచిపోలేని అనుభూతి అని అన్నారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్, సుల్తాన్, కాశన్న, బాలరాజ్, శ్రీనివాస్, వినోద్‌గౌడ్, శ్రీనివాసరెడ్డి, నాగన్‌గౌడ్, పద్మారావు, కురుమయ్య, చంద్రకళ, పద్మ, శోభ, సుధామణి, లక్ష్మి, భాగ్య, జమీరా బేగం తదితరులతో పాటు పాలెం గ్రామ పెద్దలు, ప్రజలు, స్టార్ నేతాజీ యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## బీసీల సత్తా చూపిస్తామన్నవారు.. ఇప్పుడు ఎందుకు మౌనం?

### కొండా సురేఖ వ్యవహారంపై బీసీ నేతల వైఖరిపై ప్రశ్నలు

### ప్రజల్లో చర్చకు దారితీస్తున్న రాజకీయ పరిణామాలు

### ప్రత్యేక రాజకీయ విశ్లేషణ

**తెలంగాణ రాజకీయాల్లో మంత్రి కొండా సురేఖ చుట్టూ చోటుచేసుకున్న పరిణామాలు మరోసారి రాజకీయ వర్గాల్లో చర్చకు తెరలేపాయి. కొండా సురేఖపై చర్యలు తీసుకునే అవకాశం ఉందంటూ గత కొంతకాలంగా వివిధ మీడియా వేదికల్లో, సోషల్ మీడియాలో ప్రచారం సాగింది. ఈ క్రమంలో బీసీ సంఘాలు, బీసీ నాయకులు చేసిన వ్యాఖ్యలు కూడా అప్పట్లో రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీశాయి.**



“బీసీల జోలికి వస్తే బీసీల సత్తా చూపిస్తాం” అంటూ అప్పట్లో ఘాటు గా స్పందించిన కొంతమంది నాయకులు.. ఇప్పుడు అదే అంశంపై ఎందుకు పెద్దగా స్పందించడం లేదన్న ప్రశ్న ప్రజల్లో వినిపిస్తోంది.

### అప్పుడు సవాళ్లు.. ఇప్పుడు నిశ్శబ్దం!

ఒక రాజకీయ నాయకురాలిపై చర్యలు తీసుకుంటే బీసీ వర్గాలపై దాడిగా భావిస్తామని, అవసరమైతే పోరాటం చేస్తామని అప్పట్లో పలువురు నేతలు ప్రకటించారు. కానీ ఇప్పుడు పరిస్థితులు మారిన నేపథ్యంలో వారి గొంతులు ఎందుకు వినిపించడం లేదనే చర్చ మొదలైంది. అప్పుడు మాట్లాడిన నోర్లు ఇప్పుడు ఎందుకు మూతపడ్డాయి? బీసీల కోసం పోరాడుతున్నామని చెప్పుకునే నాయకులు ఇప్పుడు ఎందుకు రోడ్డెక్కడం లేదు? నిజంగా బీసీల ఆత్మగౌరవమే ప్రధానమైతే.. ఈ నిశ్శబ్దానికి కారణమేంటి? అనే ప్రశ్నలు ప్రజల్లో తలెత్తుతున్నాయి.

### రాజకీయ సమీకరణాల ప్రభావమా?

మంత్రి పదవులు, రాజకీయ భవిష్యత్తు, పార్టీలోని అంతర్గత సమీకరణాలు ప్రతి రాజకీయ పార్టీలోనూ కీలక పాత్ర పోషిస్తాయి. కొండా సురేఖ వ్యవహారంలో కూడా అంతర్గత రాజకీయాలు పనిచేశాయనే ప్రచారం ఉంది. అయితే అలాంటి ప్రచారాలకు అధికారిక ఆధారాలు లేకపోవడంతో వాటిని వాస్తవాలుగా పరిగణించలేం. అయితే ఒక విషయం మాత్రం స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. బీసీల హక్కుల కోసం పోరాడుతున్నామని చెప్పే నాయకుల మాటలు, వారి ఆచరణ ఒకే విధంగా ఉన్నాయా? అన్నది ప్రజలు గమనిస్తున్నారు.

### బీసీల పేరుతో రాజకీయమా.. బీసీల కోసం పోరాటమా?

బీసీల రాజకీయ ప్రాతినిధ్యం, ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాటం అవసరమే. కానీ ఆ పోరాటం ఒక వ్యక్తి లేదా ఒక రాజకీయ సందర్భానికి మాత్రమే పరిమితం కాకూడదు. ఒక సందర్భంలో తీవ్రంగా స్పందించి, మరో సందర్భంలో మౌనం వహిస్తే ప్రజల్లో అనుమానాలు రావడం సహజం. “బీసీలకు అన్యాయం జరిగితే ఊరుకోం” అన్న మాటలకు ఇప్పుడు పరీక్ష సమయం వచ్చిందా? “దమ్ముంటే చర్యలు తీసుకోండి” అని సవాల్ చేసిన నాయకులు.. ఇప్పుడు తమ వైఖరిని ఎందుకు వెల్లడించడం లేదు? ఈ ప్రశ్నలకు సంబంధిత నాయకులే సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

### ప్రజలు అన్నీ గమనిస్తున్నారు

రాజకీయాల్లో మాటల కంటే ఆచరణకే విలువ ఉంటుంది. ఎవరు ఏ సందర్భంలో ఏం మాట్లాడారు? ఆ తర్వాత ఏ విధంగా వ్యవహరించారు? అనే విషయాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు. కొండా సురేఖ వ్యవహారం ముగిసిపోయిన రాజకీయ అంశమా? లేక బీసీ రాజకీయాలపై మరో పెద్ద చర్చకు నాంది పలికిందా? అనేది రాబోయే రోజుల్లో తేలాల్సి ఉంది. బీసీల పేరుతో రాజకీయాలు చేసే ప్రతి నాయకుడు.. మాటలకు మాత్రమే కాకుండా ఆచరణకు కూడా సిద్ధంగా ఉండాలి.

ప్రశ్న ఒక్కటే ---
“అప్పుడు బీసీల సత్తా చూపిస్తామన్నవారు.. ఇప్పుడు ఎందుకు మౌనం వహిస్తున్నారు?”

- గడ్డమీది నాగరాజు పటేల్
చైర్మన్, Q6 న్యూస్.
జనం వార్త





# గంధమల్ల ప్రాజెక్టుకు భూమి పూజ

## ఆలేరు రైతుల సాగునీటి కల సాకారం దిశగా అడుగు

**తుర్కపల్లి:** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామంలో ప్రతిష్టాత్మక గంధమల్ల ప్రాజెక్టు నిర్మాణానికి భూమి పూజ జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రాజెక్టు నిర్మాణానికి భూమి పూజ చేసి పనులకు శ్రీకారం చుట్టారు. గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే ఆలేరు నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల్లో సాగునీటి లభ్యత పెరగనుంది. ముఖ్యంగా రైతులకు సాగునీటి భరోసా కల్పించడంతో పాటు వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రాజెక్టు దోహదపడనుంది. 1.41 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించనున్న గంధమల్ల ప్రాజెక్టు ద్వారా ఆలేరు నియోజకవర్గంలోని సుమారు 58 వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. రిజర్వాయర్ అందుబాటులోకి వస్తే ప్రస్తుతం సాగునీటి సమస్యలను ఎదుర్కొంటున్న పలు ప్రాంతాలకు ప్రయోజనం చేకూరనుంది. బీడు భూములు సాగులోకి రావడంతో రైతుల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడే అవకాశం ఉంది.

### రేవంత్ రెడ్డి శంకుస్థాపన.. ఇప్పుడు పనులకు శ్రీకారం

గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిర్మలాపురం వద్ద శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. తాజాగా గంధమల్లలో భూమి పూజ నిర్వహించడంతో ప్రాజెక్టు నిర్మాణ పనులు తదుపరి దశకు చేరుకున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన చర్యలకు తోడు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య చేసిన కృషితో ప్రాజెక్టు పనులు ముందుకు సాగుతున్నాయని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. గంధమల్ల ప్రాజెక్టు పూర్తయితే ఆలేరు ప్రాంత రైతులకు సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు నియోజకవర్గంలో వ్యవసాయాభివృద్ధికి కొత్త ఊపొచ్చే అవకాశం ఉంది. దీంతో గంధమల్ల ప్రాజెక్టుపై ఆలేరు రైతుల్లో ఆశలు మరింత పెరిగాయి.











అడగనిదే అమ్మ అయినా అన్నం పెట్టదు అంటారు ఇది ఒకప్పటి మాట... కానీ ఇప్పుడు అడిగి మరీ అప్పులు ఇస్తామంటూ వెంటపడి మరీ నిండా ముంచుతున్నారు. సామాన్యుడి అవసరమే పెట్టుబడిగా ఎంచుకొని లెక్కకు మించి పుట్టగొడుగుల్లా అప్పులు ఇచ్చే యాప్స్ ఇప్పుడు సామాన్యుల పాలిట యమగండంలా తయారయ్యాయి. మేమంటే మేము అప్పు ఇస్తాం. మీరు సరే అంటే చాలు... క్షణాల్లో మీ అకౌంట్లో డబ్బులు వేస్తాం అంటూ వెంటపడుతున్నారు. తీసుకున్న డబ్బు సమయానికి కట్టకుంటే వాటికి వడ్డీతో పాటు చక్రవడ్డీ కలిపి వసూలు చేసే దాకా వదలడం లేదు. అంతటితో ఆగకుండా రకరకాల తరహాలో వేధింపులకు గురిచేస్తున్నారు.

### స్నేహితులు ధైర్యం చెప్పడంతో ఆత్మహత్య చేసుకోని యువకుడు :

మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు ఓ ప్రైవేట్ యాప్ లో రూ. 2 వేల లోన్ తీసుకుని సమయానికి కట్టకపోవడంతో తన ఫోటోలను వీడియో రూపంలో మార్ఫింగ్ చేసి తన ఫోన్ కాంటాక్ట్ లో ఉన్న పలువురి వాట్సాప్ నంబర్లకు పంపడంతో అయోమయానికి గురైన సదరు యువకుడు ఆత్మహత్య చేసుకోవాలని ఇంట్లో చెప్పకుండా బయటకి వెళ్లిన విషయం తెలుసుకున్న పలువురు బాధితుని స్నేహితులు అడ్డుకుని ధైర్యం చెప్పడంతో ఊరుకుని స్నేహితుల వద్ద చేతి బదులు తీసుకుని సుమారు తీసుకున్న రెండు వేల రూపాయలకు 25వేల వరకు చెల్లించాడు.




# ప్రైవేట్ లోన్ యాప్స్ దారుణాలు

- వెంటపడి మరీ క్షణాల్లో రుణాలు
- చెల్లింపులో ఆలస్యమైతే రకరకాల వేధింపులు
- పరువు పోతుందని ఆత్మహత్యలు
- ప్రైవేట్ లోన్ యాప్ లకు దూరంగా ఉండాలని పోలీసుల హెచ్చరికలు
- సర్వీస్ చార్జీలు, పెనాల్టీలతో 40శాతం వరకు అధిక వడ్డీ చెల్లింపు
- స్నేహితులు ధైర్యం చెప్పడంతో ఆత్మహత్య చేసుకోని యువకుడు




అడగనిదే అమ్మ అయినా అన్నం పెట్టదు అంటారు ఇది ఒకప్పటి మాట... కానీ ఇప్పుడు అడిగి మరీ అప్పులు ఇస్తామంటూ వెంటపడి మరీ నిండా ముంచుతున్నారు. సామాన్యుడి అవసరమే పెట్టుబడిగా ఎంచుకొని లెక్కకు మించి పుట్టగొడుగుల్లా అప్పులు ఇచ్చే యాప్స్ ఇప్పుడు సామాన్యుల పాలిట యమగండంలా తయారయ్యాయి. ఒకప్పుడు అప్పు కావాలంటే బ్యాంకుల్లో సవాలక్ష కాగితాలు, విచారణ, తనఖా పెడితే గాని అప్పు ఇవ్వని పరిస్థితి నుండి మేమంటే మేము అప్పు ఇస్తాం... మీరు సరే అంటే చాలు క్షణాల్లో మీ అకౌంట్లో డబ్బులు వేస్తాం అంటూ వెంటపడుతున్నారు. డబ్బులు వేయడం వరకు బాగానే ఉన్నా ఒకసారి వేసిన తర్వాత అసలు పంచాయితీ మొదలయినట్లే. తీసుకున్న డబ్బు సమయానికి కట్టకుంటే వాటికి వడ్డీతో పాటు చక్రవడ్డీ కలిపి వసూలు చేసే దాకా వదలడం లేదు. అంతటితో ఆగకుండా రకరకాల తరహాలో వేధింపులకు గురిచేస్తున్నారు. ఇటీవల కాలంలో ఆండ్రాయిడ్ ఫోన్ల వినియోగం పెరిగిపోయింది. చిన్న పిల్లాడి నుంచి పెద్దవారి వరకు సెల్ ఫోన్ అనేది తప్పనిసరి అయింది. ప్రధానంగా యువకుల వద్ద మాత్రం మంచి మంచి ఆండ్రాయిడ్ ఫోన్లు ఉండడం సర్వ సాధారణం అయిపోయింది. యువత కరోనా తర్వాత ఇళ్లకే పరిమితం కాగా చాలా మంది ఉద్యోగాలు కోల్పోయి ఆర్థిక మాంధ్యంలో చిక్కుకపోయారు. దీనినే ఆసరగా చేసుకున్న కొందరు ఆన్లైన్ ద్వారా అప్పులు ఇచ్చే దందా యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ప్లే స్టోర్ ఓపెన్ చేస్తే చాలు విచ్చలవిడిగా లోన్ యాప్స్ కనిపిస్తుండడంతో పాటు మరికొన్ని లింకుల ద్వారా రుణాలను అందిస్తున్నాయి. వెయ్యి నుండి మొదలు రూ.50 వేల వరకు అప్పటికప్పుడు లోన్ అందజేస్తుండగా పది రోజుల్లో తిరిగి డబ్బులు చెల్లించే విధంగా ఈ యాప్ లు అందిస్తున్నాయి. ఇచ్చిన డబ్బుకు తిరిగి చెల్లించే వరకు సర్వీస్ చార్జీలు, వడ్డీతో పాటు పెనాల్టీలతో కలుపుకొని 35 నుంచి 40 శాతం వరకు వడ్డీ చెల్లించవలసి వస్తోంది.

### ఆలస్యం అయిందా వారి పని గోవిందా...:

ప్లే స్టోర్ నుండి ఈ లోన్లకు సంబంధించిన యాప్స్ డౌన్లోడ్ చేసి ఇన్స్టాల్ చేసుకున్న తర్వాత ఫోన్లోని కాంటాక్ట్స్, ఫోటోలు, వ్యక్తిగత సమాచారం మొత్తం ఆ యాప్ తీసుకోవడం జరుగుతోంది. దీంతో ఆ వ్యక్తి యొక్క వ్యక్తిగత సమాచారం పూర్తిగా తెలియడంతో పాటు ఫోన్



వారి కంట్రోల్లోకి వెళ్ళిపోతుంది. అప్పు తీసుకున్న వ్యక్తి సకాలంలో అప్పు చెల్లించకపోవడంతో సదరు అప్పు ఇచ్చిన సంస్థలు బెదిరింపులకు పాల్పడుతున్నారు. డబ్బులు కట్టాలని అదే పనిగా ఫోన్లు చేస్తుండగా ఫోన్ లిఫ్ట్ చేయకుంటే సదరు వ్యక్తికి సంబంధించి వ్యక్తి గత సమాచారం ఆధారంగా అతడి ఫోన్ నెంబర్లతోనే అందరికి అప్పు చెల్లించడం లేదని వాట్సాప్, సాధారణ సందేశాలు పంపుతూ వేధింపులకు గురిచేస్తున్నారు. అంతే కాకుండా ఎవరితో అయితే ఎక్కువగా ఫోన్లో మాట్లాడుతున్నారో చూసి వారికి ఫోన్ చేసి ఫలానా వ్యక్తి మా దగ్గర అప్పు తీసుకొని మీ నెంబర్ ఇచ్చారు. అతడు స్పందించడం లేదు. మీకు లీగల్ నోటీసులు పంపిస్తున్నాం అని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.




# డ్రై ఫ్రూట్స్ ఏ సమయంలో తినాలి..?

మనల్ని అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంచడం కోసం అనేక రకాల పోషకాహారాలు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో డ్రై ఫ్రూట్స్ కూడా ఒకటి. కిస్మిస్‌లు, అంజీర్, ఆలుబుఖర వంటివి డ్రై ఫ్రూట్స్ జాబితాకు చెందుతాయి. అంజీర్, ఆలుబుఖరతోపాటు యాప్రికాట్స్ కూడా మనకు డ్రై ఫ్రూట్స్ రూపంలో అందుబాటులో ఉన్నాయి. ఇవే కాకుండా ఇంకా అనేక డ్రై ఫ్రూట్స్‌ను చాలా మంది తింటుంటారు. డ్రై ఫ్రూట్స్‌ను తినడం వల్ల అనేక లాభాలు కలుగుతాయి. వీటిల్లో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనకు ఆరోగ్యకరమైన ప్రయోజనాలను అందిస్తాయి. పలు వ్యాధులను నయం చేయడంలోనూ డ్రై ఫ్రూట్స్ మనకు సహాయం చేస్తాయి. అయితే డ్రై ఫ్రూట్స్ ను రోజులో అసలు ఏ సమయంలో తినాలి..? ఎప్పుడు వీటిని తింటే మనకు అధిక శాతం లాభాలు కలుగుతాయి..? అని చాలా మందికి ప్రశ్నలు తలెత్తుతుంటాయి. ఇక ఇందుకు పోషకాహార నిపుణులు సమాధానాలు చెబుతున్నారు.

### ఏ సమయంలో తినాలి..?

డ్రై ఫ్రూట్స్ లలో మన శరీరానికి కావల్సిన పోషకాలు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా విటమిన్లు ఎ, బి కాంప్లెక్స్, సితోపాటు పొటాషియం, మెగ్నిషియం, జింక్ వంటి మినరల్స్‌ను మనం డ్రై ఫ్రూట్స్ ద్వారా పొందవచ్చు. ఈ క్రమంలో ఈ పోషకాలు మనకు ఎంతో మేలు చేస్తాయి. పలు వ్యాధులను నయం చేసేందుకు సహాయం చేస్తాయి. అయితే డ్రై ఫ్రూట్స్ ను ఉదయం తింటేనే అధిక మొత్తంలో లాభాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఉదయం వీటిని బ్రేక్ ఫాస్ట్ తోపాటు కలిపి తీసుకోవాలని సూచిస్తున్నారు. దీని వల్ల అధిక మొత్తంలో పోషకాలు, ఆరోగ్యకర ప్రయోజనాలను పొందవచ్చని వారు అంటున్నారు.

### రోజంతా యాక్టివ్‌గా..

రాత్రంతా మన శరీరానికి ఎలాంటి ఆహారం లభించదు. సుమారుగా 10 నుంచి 14 గంటల పాటు శరీరం ఉపవాస దశలో ఉంటుంది. కనుక ఉదయం పూట శరీరానికి పెద్ద ఎత్తున శక్తి అవసరం అవుతుంది. ఈ క్రమంలో డ్రై ఫ్రూట్స్ ను తినడం వల్ల ఆ శక్తిని చాలా వరకు భర్తీ చేయవచ్చు. పైగా ఉదయం నుంచి మనం పనుల్లో యాక్టివ్‌గా ఉంటాం. కొందరు శారీరక శ్రమ కూడా చేస్తుంటారు. కనుక ఉదయం మన శరీరానికి శక్తి అధికంగా అవసరం అవుతుంది. ఇలాంటి సమయంలో డ్రై ఫ్రూట్స్ ను తింటే కావల్సినంత శక్తి లభిస్తుంది. దీంతో రోజంతా యాక్టివ్‌గా ఉంటారు. ఉత్సాహంగా పనిచేస్తారు. నీరసం, అలసట ఉండవు. బద్ధకం పోతుంది. కనుక డ్రై ఫ్రూట్స్ ను ఉదయం పూట తింటేనే మంచిదని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.





# ఆమ్మో నేటికాలం పిల్లలా..!



- మాటవినడం లేదని తలలు పట్టుకుంటున్న తల్లిదండ్రులు
- ఆటలు మరచి ఫోన్లు, టీవీలకే అతుక్కుపోతున్న పిల్లలు
- ర్యాంక్‌లకు తప్పా ఆటలకు ప్రాధాన్యత ఇవ్వని నేటి ప్రైవేటు స్కూల్స్

**నేటి ఆధునిక బిజీ ప్రపంచంలో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలు ఏం చేస్తున్నారు. వారి ఆహారపు అలవాట్లు ఏమిటి, వారి స్నేహాలు, వారు ఎలా చదువుతున్నారు అన్న విషయాలపై శ్రద్ధ వహించరు. ఒకప్పుడు చూస్తే మన తల్లిదండ్రులు అంటే భయం భక్తులు ఉ ండేవి. వారు చెప్పినట్లు వినేవాళ్లు. అలానే ఎక్కువగా శారీరక ఆటలకు ప్రాధాన్యత ఇచ్చేవాళ్ళం. ఇప్పుడు సెల్ ఫోన్లు, వీడియో గేమ్ లు వచ్చాక పిల్లలు శారీరక ఆటలకు దూరమయి తినడం టీవీ, ఫోన్ల ముందు కూర్చో వడం వలన ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని వైద్యులు చెబుతున్నా రు. అసలు పిల్లల గురించి ఎటువంటి జాగ్రతలు తీసుకోవాలి, వారిని వృద్ధిలోకి ఎలా తేవాలి అనే విషయాల గురించి ప్రత్యేక కథనం...**

పిల్లలకి తల్లిదండ్రులే మొదటి గురువులు. భవిష్యత్తులో చిన్నారులు సరైన దారిలో నడవలాంటే పెద్దలుగా మీ నడవడికలో కొన్ని మార్పులు చేసుకోవాలి. అవేంటంటే... పిల్లలకు మీరేంటో స్పష్టంగా తెలియాలి. వాళ్ల ముందు అనవసరపు భేషజాలను ప్రదర్శించకూడదు. పొరపాటు జరిగితే ఒప్పుకోవడమే కాదు దాన్ని సరిదిద్దుకునే ప్రయత్నం కూడా చేయాలి. అప్పుడే చిన్నారులూ పాటిస్తారు. పెద్దవాళ్లుగా మీరెప్పుడూ జీవిత పాఠాలను చెబుతూనే ఉండాలని.. పిల్లలు వాటిని వింటూనే ఉండాలని కోరుకోకూడదు. చిన్నారులు చెప్పే విషయాలను మీరూ ఆసక్తిగా వినాలి. అప్పుడే వారు మనసులోని భావాల్ని స్వేచ్ఛగా మీతో పంచుకోగలుగుతారు. మీ అనుబంధం బలపడుతుంది. పెద్దలు పోషకాహారం తీసుకుంటూ క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే వాళ్లూ మెల్లగా అవే నేర్చుకుంటారు. అలా పిల్లలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండటానికి అవసరమైన పునాదిని చిన్నతనంలోనే వేయొచ్చు. ప్రేమంటే.. పిల్లలకు కావాల్సిన వస్తువులను అప్పటికప్పుడు సమకూర్చడం కాదు. చిన్నారులను ఆప్యాయంగా దగ్గరకు తీసుకోవడం, మనసు విప్పి మాట్లాడటం, మీకు నేనున్నాననే భరోసాను కల్పించడం. ఇలా మీరు చూపించే అంతులేని ప్రేమాభిమానాలు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి. మీరు సానుకూలంగా ఆలోచిస్తే చిన్నారులకూ అదే అలవాటవుతుంది. క్లిష్ట పరిస్థితులను సవాలుగా తీసుకుని మీరు ధైర్యంగా ముందడుగు వేస్తే... పిల్లలూ అదే బాటలో పయనిస్తారు.

## పిల్లలు గొడవపడుతున్నారా...:

ముగ్గురు పిల్లలున్న ఇళ్లల్లో సాధారణంగా చిన్నచిన్న విషయాలకే గొడవలు జరుగుతుంటాయి. మామూలే అన్నట్టుగా వీటిని నిర్లక్ష్యంగా వదిలేయ కూడదు. అలాగని ప్రతి చిన్న విషయాన్నీ భూతద్దంలో చూసి భయపడకూడదు. ముగ్గురిని సమానమే అని చూడాలి. తల్లిదండ్రులు ముందుగా ముగ్గురిని సమానంగా చూడటం మొదలుపెట్టాలి. కొంతమంది క్రమపద్ధతి పేరుతో పెద్ద పిల్లలను ఎక్కువగా మందలిస్తూ, చిన్నవాళ్లను మరీ గారాబం చేస్తుంటారు. దీంతో తల్లిదండ్రులకు నాకంటే ఎదుటివాళ్లే ఇష్టమని అపోహపడి వారిపై అనవసరంగా అసూయను పెంచుకుంటారు. క్రమేపీ అది మరింత పెరిగి పెద్దదవుతుంది. సాధారణంగా ఎక్కువగా ఇళ్లల్లో పిల్లల మధ్య తగాదాలకు కారణం టీవీ రిమోటే అవుతుంది. పిల్లలు ఇద్దరూ టీవీ చూడాలనుకుంటారు. కానీ చెరో ఛానెల్ కావాలంటారు. ఇలాంటప్పుడు ఒక్కొక్కరికీ ఒక్కో సమయాన్ని కేటాయించాలి. అలాగే అమ్మానాన్నల సెల్ ఫోన్ తీసుకుని గేమ్స్ ఆడే విషయంలోనూ గొడవలు జరుగుతుంటాయి. ఇలాంటప్పుడు ఇద్దరికీ జ్ఞానం కోసం తక్కువ సమయాన్ని కేటాయించాలి.



## చదవాలంటే ఏం చేయాలి...:

టీవీ చూడటమన్నా పిల్లలు సెల్ ఫోన్లో గేమ్స్ ఆడటమన్నా పిల్లలకు ఎంతిష్టమో చెప్పలేం. కానీ పుస్తకాలు చదవడ మంటే మాత్రం... 'అందులో ఏముందో నువ్వే చెప్పమ్మా' అనేస్తుంటారు. ఇలాంటి వారిలో పుస్తక పఠనం పట్ల ఆసక్తి కలిగించడానికి ఇలా ప్రయత్నించవచ్చు. రంగురంగుల బొమ్మలతో ఆకర్షణీయంగా ఉండే కథల పుస్తకాలను పిల్లలకు అందుబాటులో ఉంచాలి. నిద్రపోయే ముందు చిన్నారులకు రోజూ ఓ కథను చెప్పడం అలవాటు చేయాలి. దీనివల్ల వాళ్లకు కథలంటే ఆసక్తి పెరుగుతుంది. ఇలాంటి చాలా కథలు పుస్తకాల్లో ఉ ంటాయని చెప్పాలి. దీంతో పుస్తకాలు చదవాలనే ఆసక్తికి చిన్నతనంలోనే బీజంపడుతుంది. ముందుగా వాటిని చూడటం అలవాటు చేస్తే అందులోని బొమ్మలను ఆసక్తిగా గమనిస్తుంటారు. ఆ తర్వాత వాటిలోని అక్షరాలను చదవడానికి మెల్లగా ప్రయత్నిస్తుంటారు. నిత్యావసర వస్తువులు లిస్టును తయారుచేసినప్పుడు అందులో ఉన్న వస్తువుల పేర్లను పిల్లలతో చదివించవచ్చు. పిల్లలకు ఇష్టమైన వంటకం తయారీ విధానాన్ని వాళ్లతోనే చదివించాలి. నేరుగా కథల పుస్తకాలనే కాకుండా ముందుగా చిన్నచిన్న పదాలను చదవడం అలవాటు చేయాలి. రోడ్డు మీద పెద్ద పెద్ద అక్షరాలతో రాసి ఉండే బోర్డులను చదివిస్తుండాలి. పిల్లలని టీవీ, సినిమా తెరల మీద కనిపించే పేర్లను చదవమనండి. అవి ఇలా వచ్చి అలా మాయమవుతుంటాయి. కాబట్టి వాటిని వేగంగా చదవడం అలవాటవుతుంది.

## కలిసి పనిచేయడం...:

గొడవ పడతారని పిల్లల్ని కలవనీయకుండా చేయ కూడదు. వేర్వేరు పనుల్ని అప్పగించకూడదు. ఇంటికి సంబంధించిన కొన్ని పనులను ఇద్దరూ కలసి పూర్తిచేసేలా చూడాలి. ఇంటిని శుభ్రంగా ఉంచడం లేదా మొక్కలకు నీళ్లు పోయడం లాంటి తేలికైన పనులు ఇస్తుండాలి. దీనివల్ల కలసిమెలసి పనిచేయడం చిన్నతనం నుంచీ అలవాటవుతుంది. ఏ కాస్త సమయం చిక్కినా పిల్లలతో తల్లిదండ్రులు మాట్లాడుతూ ఉండాలి. వాళ్ల చిట్టి బుర్రలకు వచ్చే చిన్ని చిన్ని సందేహాలను ఎప్ప టికప్పుడు తీరుస్తుండాలి. కుటుంబమంతా ఒకటేననే భావనను వాళ్ల మనసులో బలంగా నాటాలి. దాంతో చిన్న చిన్న విషయలకు సంకుచితంగా ఆలోచించి గొడవపడడం మానేస్తారు.

## పిల్లల్లో సృజనాత్మక ఎలా పెంచాలి...:

ఆర్ట్ అండ్ క్రాఫ్ట్.. చిన్నారులకు నచ్చిన విధంగా ఆర్ట్ క్రాఫ్ట్ పాలు పంచుకునేలా చూడండి. వారికి వచ్చిన విధంగా పెయింటింగ్స్ వేయమనండి. "కచ్చితంగా ఇలాగే వచ్చి తీరాలి' అంటూ వారిని ఇబ్బంది పెట్టొద్దు. బొమ్మలు గీయడం, రంగులు వేయడం, స్కెల్ తో రకరకాల బొమ్మలు తయారుచేయడం, కాగితాలతో డిజైన్లు కత్తిరించడం, పూసలు, రాళ్లు, చమ్కీలతో గాజులు, ఇతర వస్తువులు తయారు చేయడం లాంటివి చేయనివ్వండి. ఈ పనులతో వారిలో ఏకాగ్రతతో పాటు సృజనాత్మకత పెరుగుతుంది. రోజూ ఓ పుస్తకం చదివేలా చూడండి. ఇలా చేస్తే పద సంపదతో పాటు ఊహాశక్తి పెరుగుతుంది. చక్కగా రాయగలుగుతారు. ఇంటి పనుల్లో సాయం... ఇంటి పనులు, వంటల్లో చిన్నారుల సాయం తీసుకోండి. కూరగాయలు సర్దడం, కడగడం, ఇల్లు శుభ్రం చేయడం లాంటి చిన్న చిన్న పనులు నేర్పండి. ఇలా చేయడం వల్ల పిల్లలకు సొంతంగా పనులు చేసుకోవడం అలవాటు అవుతుంది. ఆత్మవిశ్వాసమూ పెరుగుతుంది.

## రోగ నిరోధక శక్తి పెంచే ఆహారం పెట్టాలి :

నేటి పిల్లలు ఎక్కువగా జంక్ ఫుడ్ కు అలవాటు పడి ఉంటారు. అవి తినడం వలన పిల్లల్లో ఊబకాయం పెరిగి ఆరోగ్య సమస్యలు వస్తాయి అని వైద్యులు చెబుతున్నారు. పిల్లలకు ముఖ్యంగా విటమిన్లు, పోషకాహారం ఇవ్వాలి. పాలు, గుడ్లు, ఆకు కూరలు, గింజలు, బాదం, పండ్లు ఎక్కువగా తినేలా వారిని ప్రోత్సహించాలి. అప్పుడే పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది అని వైద్యులు సలహాలు ఇస్తున్నారు. ఏది ఏమైనా నేటి ఆధునిక యుగంలో పిల్లలకి యనభై, తొంబై దశకంలో పెరిగిన పిల్లలకి ఉన్న తేడా అందరికీ తెలిసిందే. పిల్లలు అన్ని రకాలుగా చురుగ్గా ఉండాలంటే పైన తెలిపిన సూచనలను పాటించాలని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



## మాతోపాటు మీరు ఎంజాయ్ చేస్తారు

రాజ్ తరుణ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'టార్టాయిస్'. అమృత చౌదరి, అవసరాల శ్రీనివాస్, ధన్య బాలకృష్ణ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీని ఎస్ కే గోల్డెన్ ఆర్ట్స్, ప్రశ్విత ఎంటర్టైన్మెంట్, ఎన్ వీ ఎల్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై విజయ్ చౌదరి, శశిధర్ నల్ల, రామిశెట్టి రాంబాబు నిర్మిస్తున్నారు. సస్పెన్స్, డ్రామా కలిసిన ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్ కథతో దర్శకుడు రిత్విక్ కుమార్ రూపొందిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి వచ్చిన ఫస్ట్ లుక్ పోస్టర్ అందరి దృష్టినీ ఆకర్షించగా.. తాజాగా 'నీ పరిచయం..' పాటను గ్రాండ్‌గా రిలీజ్ చేశారు. ఈమేరకు ఏర్పాటు చేసిన ఈవెంట్‌లో హీరోయిన్ అమృత చౌదరి మాట్లాడుతూ.. 'నీ పరిచయం సాంగ్ మీ అందరికీ నచ్చిందని నమ్ముతున్నాను. ఈ సాంగ్ షూటింగ్ చేసేప్పుడు మేము చాలా ఎంజాయ్ చేశాం. అలాగే మీరూ ఈ పాటను ఆస్వాదిస్తారని అనుకుంటున్నాను. రావులపాలెంలో ఈ పాట చిత్రీకరణ జరిగింది. అక్కడ షూటింగ్ చేసినన్ని రోజులు స్థానిక ప్రజలు ఎంతో ప్రేమను చూపించారు. బొబ్బట్లు, చేపలు తీసుకొచ్చి ఇచ్చేవారు. వాళ్ల నిస్వార్థ ప్రేమను చూశాం. అనూప్ గారు మాకు బ్యూటిఫుల్ సాంగ్ ఇచ్చారు. ఇలాగే మీ సపోర్ట్ మా మూవీకి ఉండాలని కోరుకుంటున్నా' అని ఆనందం వ్యక్తం చేసింది.



## మలయాళ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే

యంగ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే.. ఇటీవల వచ్చిన 'లెనిన్' చిత్రంతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఈ ఒక్క సినిమా విజయంతో అమ్మడి రేంజ్, క్రేజ్ పూర్తిగా మారిపోగా.. వరుస ఆఫర్లు అందుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే భాగ్యశ్రీ మలయాళంలో ఓ బంపర్ అందుకున్నట్లు వార్తలు రాగా.. తాజాగా దీనిపై క్లారిటీ వచ్చింది. మలయాళ స్టార్ హీరో మోహన్‌లాల్ హీరోగా, శ్రీ గోకులం మూవీస్ బ్యానర్‌పై విష్ణు మోహన్ దర్శకత్వంలో ఓ బిగ్ ప్రాజెక్టు రాబోతున్నది. ఈ సినిమాకు 'ఆపరేషన్ గంగా – ఎ నేషన్స్ ప్రామిస్' అనే టైటిల్ ఖరారు చేస్తూ అఫీషియల్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. గోకులం గోపాలన్ నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా సాగుతోంది. ఇందులో బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్, ఆర్. పార్తీపన్, ఆదిల్ హుస్సేన్ కీలక పాత్రల్లో నటిస్తుండగా.. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు మేకర్స్. ఇక ఈ చిత్రంతో భాగ్యశ్రీ బోర్సే మలయాళ ఎంట్రీ ఇవ్వడం విశేషం. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు వైరల్ అవుతుండగా.. ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు.



## సౌత్ ఇండస్ట్రీ నాపై చూపించిన దయ ఎప్పటికీ మరువలేను

### శ్రియా శరణ్ ఆసక్తికర కామెంట్స్

ఒకప్పుడు సౌత్ ఇండియన్ సినిమాలో స్టార్ హీరోయిన్‌గా ఏలిన అందాల భామ శ్రియా శరణ్, ప్రస్తుతం తన సెకండ్ ఇన్నింగ్స్‌లో వైవిధ్యమైన క్యారెక్టర్ ఆర్టిస్ట్ పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. గత కొద్దికాలంగా హీరోయిన్ అవకాశాలు తగ్గినప్పటికీ, సరైన పాత్రలను ఎంచుకుంటూ ఆవారాపన్-2' తో బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటించిన 'దృశ్యం-3' అక్టోబర్ 2న విడుదల కానుంది. దీంతో పాటు శ్రియా చంద్రయాన్ నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న ఒక ప్రతిష్టాత్మక వెబ్ సిరీస్‌లో యామిని ముడలియార్ అనే ఎంతో పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తూ బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో.. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రియ, సౌత్ ఇండస్ట్రీ, దర్శకధీరుడు రాజమౌళి గురించి చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. సౌత్ పరిశ్రమ గురించి శ్రియ మాట్లాడుతూ.. "సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీ నా పట్ల ఎంతో ఆదరణతో, దయతో వ్యవహరించింది. ఈ పరిశ్రమ నాకు అపారమైన ప్రేమను అందించడమే కాకుండా, ఒక నటిగా నన్ను నిలబెట్టడానికి ఎన్నో గొప్ప అవకాశాలను ఇచ్చింది. ఇక్కడ నాకు దక్కిన ఆదరణ ఎప్పటికీ మరువలేనిది" అని ఎంతో సంతోషంగా చెప్పారు. ఇక దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి గురించి చెప్తూ.. "షూటింగ్ సమయంలో ఆయన చూపించే తీవ్రత, ఆయనకున్న విజన్ నిజంగా అద్భుతం. అంతటి గొప్ప విజన్‌తో సినిమాలు తీయాలని ప్రతి ఒక్కరూ కలలు కంటారు, కానీ రాజమౌళి గారు తన ఆలోచనలకు, ఊహలకు తెరపై అద్భుతమైన రూపం ఇస్తారు. ఒక చిత్రనిర్మాతగా ఆయనలోని అభిరుచి, వర్క్ పట్ల ఉండే డెడికేషన్ మరో స్థాయిలో ఉంటాయి. ఎంతటి పెద్ద కలనైనా ఒక అద్భుతమైన సినిమాటిక్ అనుభవంగా మార్చగల అరుదైన సామర్థ్యం ఒక్క రాజమౌళి గారికి మాత్రమే సొంతం" అని శ్రియ ప్రశంసల వర్షం కురిపించారు.



# ఇషాన్ అజేయ శతకం

## సౌత్‌తో దులీప్ ట్రోఫీ ఫైనల్

ఫస్ట్‌క్లాస్ క్రికెట్ టోర్నీ దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఈస్ట్ జోన్‌కు అదిరే ఆరంభం. కెప్టెన్ ఇషాన్ కిషన్ (111 బ్యాటింగ్; 135 బంతుల్లో 14ఐ4, 1ఐ6) అజేయ శతకం బాదడంతో మొదటి రోజు, ఆదివారం ఆట ముగిసే సమయానికి ఈస్ట్ 4 వికెట్ల నష్టానికి 385 పరుగులు చేసింది. శిఖర్ మోహన్ (85), అభిమన్యు ఈశ్వరన్ (72), కుమార్ కుశాగ్ర (63 బ్యాటింగ్), వైభవ్ సూర్యవంశీ (44) కూడా రాణించారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఈస్ట్‌కు శుభారంభం లభించింది. ఓపెనర్లు అభిమన్యు, వైభవ్ తొలి వికెట్‌కు 100 పరుగులు జోడించారు. అయితే ఈ ఓపెనర్లతో పాటు సుదీప్ కుమార్ (6) కొద్ది తేడాలో ఔట్ కావడంతో ఈస్ట్ 147/3తో నిలిచింది. మరో వికెట్ పడుంటే ఆ జట్టు పరిస్థితి ఇబ్బందికరంగా మారేదే. ఈ దశలో ఇషాన్.. కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. దూకుడైన ఆటతో స్కోరు బోర్డును నడిపించాడు. చక్కని షాట్లతో అలరించిన అతడు.. 71 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాడు. మరో 51 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇషాన్‌కు శిఖర్ మోహన్, కుశాగ్ర చక్కని సహకారాన్నిచ్చారు. శిఖర్‌తో నాలుగో వికెట్‌కు 94 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన ఇషాన్.. కుశాగ్రతో అభేద్యమైన అయిదో వికెట్‌కు 144 పరుగులు జోడించాడు. సౌత్‌జోన్ బౌలర్లలో చామా మిలింద్ (2/56) రాణించాడు.

# ఓటమిని తప్పించుకున్న భారత్

## జపాన్‌తో మ్యాచ్ డ్రా

## జూనియర్ ఆసియాకప్ హాకీ

**చైనా:** జూనియర్ ఆసియాకప్ హాకీ టోర్నమెంట్ తొలి మ్యాచ్‌లో ఇండోనేసియాను 14–0తో చిత్తు చిత్తుగా ఓడించిన భారత పురుషుల జట్టు.. ఆదివారం జపాన్‌తో రెండో మ్యాచ్‌లో కొద్దిలో ఓటమిని తప్పించుకుంది. ఆఖరి నిమిషంలో గోల్‌తో 3–3తో డ్రా చేసుకుంది. పూల్–ఎ పోరులో ఆరంభంలో ఆధిక్యంలో కొనసాగిన అన్మోల్ బృందం.. తర్వాత పట్టు కోల్పోయి ప్రత్యర్థికి పుంజుకునే అవకాశాన్ని ఇచ్చింది. తొలి క్వార్టర్ మొదట్లో పెనాల్టీ స్ట్రోక్‌తో అన్మోల్ (4వ నిమిషం) గోల్ కొట్టడంతో భారత్ 1–0తో నిలిచింది. కాసేపటికే ఆధిక్యం రెట్టింపైంది. అషు మౌర్య (10వ) పెనాల్టీ కార్నర్‌ను సద్వినియోగం చేశాడు. కానీ జపాన్ వెంటనే పుంజుకుంది. రయుషిన్ ససాకి (11వ) గోల్‌తో 1–2తో నిలిచింది. తర్వాతి రెండు క్వార్టర్లలో భారత్–జపాన్ గోల్స్ కోసం గట్టిగానే పోరాడినా ఫినిషింగ్ చేయలేకపోయాయి. ఆఖరి క్వార్టర్‌లో కెప్టెన్ నకనిషి (48వ) సఫలం కావడంతో జపాన్ స్కోరు సమం చేసింది. కాసేపటికే ఆ జట్టు ఖాతాలో మరో గోల్ చేరింది. నకనిషి (59వ) గోల్‌తో జపాన్ 3–2తో విజయానికి చేరువైంది. ఇంకో 59 సెకన్లలో మ్యాచ్ ముగుస్తుందనగా భారత్‌కు పెనాల్టీ కార్నర్ దక్కింది. ఆ అవకాశాన్ని కెప్టెన్ అన్మోల్ సద్వినియోగం చేసి భారత్‌ను ఓటమి నుంచి బయటపడేశాడు. మంగళవారం కొరియాతో భారత్ తలపడనుంది.

అమ్మాయిలకు ఘనవిజయం: మహిళల జూనియర్ ఆసియాకప్ టోర్నీలో భారత్ వరుసగా రెండో విజయాన్ని అందుకుంది. ఆదివారం జరిగిన



పోరులో 11–1తో మలేసియాను చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో ఆద్యంతం ఆధిపత్యం ప్రదర్శించిన భారత్.. గోల్ మీద గోల్ కొట్టింది. తొలి నిమిషం నుంచి ఆఖరిదాకా అదే జోరు కొనసాగించింది. పూజ సాహో (1వ, 42వ), పూర్ణిమ యాదవ్ (4వ, 17వ), గీత యాదవ్ (28వ, 53వ), సనిక మానె (43వ, 58వ) రెండేసి గోల్స్ కొట్టగా.. బినిమా ధాన్ (8వ), కృష్ణ శర్మ (14వ), సుఖ్‌వీర్ కౌర్ (21వ) ఒక్కో గోల్ సాధించారు. మలేసియా తరఫున ఏకైక గోల్‌ను నూర్ మహ్మద్ (38వ) చేసింది.




# ఈఎంఐ చెల్లించకపోతే ఏమవుతుంది?

**ఇల్లు, కారు, వ్యక్తిగత అవసరాలు, విద్య లేదా వ్యాపారం కోసం తీసుకున్న రుణంపై ప్రతి నెలా చెల్లించే మొత్తాన్ని ఈఎంఐ అంటారు. ఆదాయం తగ్గడం, ఉద్యోగం కోల్పోవడం, వ్యాపారంలో నష్టం, ఊహించని వైద్య ఖర్చులు వంటి కారణాల వల్ల కొన్నిసార్లు సమయానికి ఈఎంఐ చెల్లించడం కష్టతరం కావచ్చు. ఒక ఈఎంఐ మిస్ అయిన వెంటనే రుణం నిరర్థక ఆస్తి అయిపోదు. ఈఎంఐ గడువు తేదీ దాటిన వెంటనే ఆ మొత్తాన్ని ఓవర్‌డ్యూ గా పరిగణిస్తారు. ఆర్‌బీఐ నియమాల ప్రకారం వడ్డీ/అసలు మొత్తం 90 రోజులకు మించి ఓవర్‌డ్యూగా ఉంటేనే ఆ ఖాతాను ఎన్‌పీఏగా వర్గీకరిస్తారు.**

ఒక ఈఎంఐ గడువు తేదీలో చెల్లించకపోతే.. మొదటగా బ్యాంకు లేదా రుణ సంస్థ మీకు ఎస్సెమ్మెస్, ఇ–మెయిల్ లేదా ఇతర మార్గాల్లో చెల్లింపు గురించి గుర్తు చేస్తుంది. సాధారణంగా, ఆలస్యమైన చెల్లింపునకు సంబంధించిన సాధారణ వడ్డీ, వర్తించే పెనాల్టీ ఛార్జీలు లేదా ఇతర ఒప్పందపరమైన ఛార్జీలు వర్తిస్తాయి. సాధారణంగా మూడు ఈఎంఐలు చెల్లించనప్పుడు ఎన్‌పీఏగా పరిగణిస్తారు. ఒక 90 రోజులకు పైగా చెల్లించకుండా ఉంచడాన్ని కూడా ఎన్‌పీఏగా గుర్తిస్తారు. ఒకటి కంటే ఎక్కువ ఈఎంఐలు వరుసగా బకాయిపడితే పరిస్థితి మరింత క్లిష్టమవుతుంది.

### ఈఎంఐ మిస్ అయితే ఏ ఛార్జీలు పడతాయి?

రుణ ఒప్పందం, రుణ సంస్థ విధానాన్ని బట్టి ఆలస్య చెల్లింపుపై వివిధ ఛార్జీలు ఉంటాయి. సాధారణంగా రుణంపై ఒప్పందం ప్రకారం వర్తించే వడ్డీ కొనసాగుతుంది. ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం.. 'బఅ–జ్ఝుఅస 'పై ఒప్పందంలోని సాధారణ వడ్డీ లెక్కింపు ప్రక్రియను ఇది ఆపదు. 'లేట్ ఛార్జ్'ను ఆర్‌బీఐ అన్ని బ్యాంకులకు ఒకేలా నిర్ణయించలేదు. కాబట్టి రుణ సంస్థలు తమ బోర్డు ఆమోదించిన విధానం ప్రకారం సమంజసమైన, నిబంధనలకు అనుగుణమైన ఛార్జీలు నిర్ణయిస్తుంది. ఛార్జీతో పాటు దాని కారణాన్ని రుణ ఒప్పందం, వంటి పత్రాల్లో ముందుగానే వెల్లడించాలి.

### ఈఎంఐ చెల్లించకపోతే క్రెడిట్ స్కోర్‌పై ప్రభావం ఉంటుందా?

ఆలస్య చెల్లింపులు మీ క్రెడిట్ చరిత్రపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా పదేపదే ఆలస్యమైతే భవిష్యత్తులో రుణం లేదా క్రెడిట్ కార్డు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. క్రెడిట్ స్కోర్‌ను కాపాడుకోవడానికి చెల్లించలేని పరిస్థితి ఏర్పడిన వెంటనే రుణ సంస్థను సంప్రదించడం మంచిది. సమస్యను దాచిపెట్టి ఈఎంఐలు వరుసగా మిస్ చేయడం కంటే ముందుగానే పరిష్కారం కోరడం సాధారణంగా మెరుగైన విధానం.

### చెల్లించలేకపోతే ఏం చేయాలి?

ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఈఎంఐలు చెల్లించలేని పరిస్థితి ఎదురైతే బ్యాంకును వెంటనే సంప్రదించండి. మీ పరిస్థితిని వివరించి, అందుబాటులో ఉన్న పరిష్కారాలను అడగండి. కొన్ని సందర్భాల్లో రుణ సంస్థ తన విధానాల ప్రకారం రీపేమెంట్ షెడ్యూల్‌లో మార్పు, రీషెడ్యూలింగ్, ఇతర మార్గాలను సూచించొచ్చు. రుణ రకం, పరిస్థితి, సంస్థ విధానంపై బ్యాంకు నిర్ణయం ఆధారపడి ఉంటుంది. ఒకవేళ మీ జీతం వచ్చే తేదీ, ఈఎంఐ తేదీ మధ్య ఎక్కువ గ్యాప్ ఉంటే, జువీ× తేదీ మార్పును కోరవచ్చు. కొన్ని రుణ సంస్థలు తమ విధానం ప్రకారం దీన్ని అనుమతిస్తాయి.

### రుణం అయితే ఏమవుతుంది?

రుణ ఖాతా ఎన్‌పీఏగా మారితే రుణగ్రహీతకు పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతుంది. బకాయిల వసూలు కోసం రుణ సంస్థ తనకు వర్తించే చట్టపరమైన, ఒప్పందపరమైన ప్రక్రియలను ప్రారంభిస్తాయి. సెక్యూర్డ్ లోన్ అయితే, వర్తించే చట్టాల ప్రకారం తాకట్టు పెట్టిన ఆస్తిపై రికవరీ చర్యలు కూడా చేపట్టే అవకాశం ఉంటుంది. అందువల్ల ఛీూా దశకు చేరకముందే సమస్యను పరిష్కరించుకోవడానికి ప్రయత్నించడం చాలా ముఖ్యం.

PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com